గుట్టల్లో ఇసుక డంపులు

- అనుమతి పేరుతో అక్రమదందా
- ఒకే వేబిల్లుకు రెండు రోజుల అనుమతి
- రాత్రి వేళల్లో లారీల్లో తరలింపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గోపన్‌పల్లిలో అక్రమ ఇసుక డంపులు (ఫైల్)



రెండు రోజుల వేబిల్లు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ పనులు కొనసాగుతున్నాయని బాన్సువాడ ఆర్డీవో నుంచి ఇసుక తరలింపు కోసం అనుమతులు తీసుకొచ్చి ట్రాక్టర్ల ద్వారా గుట్టల్లో డంపు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో అక్రమ ఇసుక దందాకు తెరలేపారు. జిల్లా అధికారులు అక్రమ ఇసుక రవాణాను నియంత్రించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా దందా ఆగడం లేదు. స్థానిక అధికారులు అండదండలతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోపన్‌పల్లి, పుల్కల్ గుట్టల్లో డంపు చేసి అర్ధరాత్రి వేళల్లో తరలిస్తున్నారు. ఇలాగే శుక్రవారం డంప్ చేసిన ఇసుకను అర్ధరాత్రి వేళ తరలించినట్లు తెలుస్తోంది.

వే బిల్లు ఒక్కటే..

బిచ్కుంద రెవెన్యూ అధికారులు గురువారం హజ్గుల్, శుక్రవారం పుల్కల్ మంజీర నుంచి ట్రాక్టర్లలో ఇసుక తలింపు కోసం వేబిల్లు ఇచ్చారు. వే బిల్లులో పనులు జరుగుతున్న గ్రామం, ట్రాక్టర్ నంబర్, సమయం రాయాలని నిబంధనలు ఉన్నాయి. వే బిల్లు పైన డోన్‌గాం దారి జుక్కల్, పిట్లం మండలం పొంతన లేని రాతలు రాసి ఒకే వే బిల్లు మీద రెండు రోజులు ఇసుక తరలింపునకు అనుమతులు ఇచ్చారు. ఒక్క ట్రాక్టర్ ఇసుకకు ఒక వేబిల్లుకు ప్రభుత్వానికి రూ.660 సీనరేజ్ చార్జీలు చెల్లించాలి. కానీ ఒకే వేబిల్లు మీద రోజుకు నాలుగైదు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. రోజుకు 50 నుంచి 70 ట్రాక్టర్లు నడుస్తున్నాయి. వే బిల్లు రికార్డులో 20 ట్రాక్టర్లు నమోదు చేసుకున్నారు. ఒక్క ట్రాక్టర్ నాలుగు ట్రిప్పుల సీనరేజ్ చార్జీలు చెల్లించాల్సి ఉండగా, ట్రాక్టర్ యూనియన్ నాయకులు అధికారుల చేతులు తడిపి ఒకే ట్రిప్పు సీనరేజ్ చార్జీలు చెల్లించి రోజుకు రెండు లక్షల మేర ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అనుమతి ఇచ్చిన డోన్‌గాం, పిట్లం మండలంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు ఎక్కడ కూడా జరగడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి అనుమతి ఇచ్చిన దాని పై విచారణ చేసి చర్యలు తీసుకొని అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదుతో రెవెన్యూ అధికారుల బదిలీ

అక్రమ ఇసుక కోసం బిచ్కుంద రెవెన్యూ అధికారులు ఇసుక మాఫియాకు సహకారం అందిస్తున్నారని హజ్గుల్, బిచ్కుంద గ్రామస్తులు జిల్లా, డివిజన్ అధికారులు, ప్రజాప్రతినిధులు నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వెంటనే కలెక్టర్ విచారణ చేపట్టి తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్‌ను వారం రోజులక్రితం ముగ్గురు అధికారులను బదిలీ చేశారు. పిట్లం నుంచి ఆర్ఐ, నాగిరెడ్డిపేట్ నుంచి తహసీల్దార్ బదిలీపై వచ్చారు. మండలానికి కొత్తగా అధికారులు వచ్చినప్పటికీ ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదని మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతున్నది. శుక్రవారం నాటికి లక్షా 83వేల 967 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

బియ్యం తూకం సరిగా చేయాలి



పిట్లం(జుక్కల్): చౌక ధరల దుకాణాల్లో బియ్యం సరిగా తూకం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్ అన్నారు. మండల కేంద్రంలోని పలు రేషన్‌దుకాణాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ ఏ విధంగా కొనసాగుతున్నదని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. డీలర్లు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిందూర పూజలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ స్వాములు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర పూజ, భజన చేశారు. గురుస్వామి బోయిని నాగభూషణం భక్తులకు, హనుమాన్ మాలధారులకు అన్నదానం చేశారు.

కార్యకర్తలకు తగిన గుర్తింపు



భిక్కనూరు: పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో లేకున్నప్పటికీ పార్టీలోనే ఉండి కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడు మహ్మద్‌అలీ షబ్బీర్ అన్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సార్గు నరేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం షబ్బీర్‌ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నీరడి బాబు, నాయకులు అమీన్, ప్రవీణ్‌గౌడ్, కార్తీక్, కొండం రవి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



బాన్సువాడ : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈఆర్ఆర్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మూడురోజులపాటు కొనసాగనున్న టోర్నీని డీఎస్పీ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే తనయుడు ఏనుగు నిఖిల్‌రెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్‌సింగ్, ఖలేక్, మాసాని శేఖర్‌రెడ్డి, మంత్రి గణేశ్, రఫీ, లాయఖ్, అక్బర్, యూనుస్, అన్వర్, నార్ల సురేశ్, నార్ల రాఘవేందర్, నాయిని శంకర్, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు షటిల్ టోర్నమెంట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఈనెల 15న షైన్ బ్యాడ్మింటన్ ఆధ్వర్యంలో మండల స్థాయి షటిల్, క్యారం, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు అధ్యక్షులు మతియొద్దీన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు డ్రా తీస్తామన్నారు. పూర్తి వివరాలకు 99637 97886 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లా ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధంగా ఉన్న ఆటో యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.సురేందర్‌రావు, ఉపాధ్యక్షులుగా టి.బుగ్గరాములు, బీరప్ప యాదవ్, అలుగనూరి మహేందర్, ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రాజేందర్, కార్యదర్శులుగా బి.బాలరాజు, సిద్ధిరాములు, జి.రవికుమార్, సాయిలు, సంఘటన కార్యదర్శిగా గడ్డం బాలయ్య, కోశాధికారిగా పైడి శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శిగా వడ్ల జీవన్, సభ్యులుగా ముల్క రవి, ఆర్.అనిల్‌కుమార్, వై.మహేందర్, హెచ్.అనిల్, బి.దశరథం, నారాయణ, ఆర్.విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

నిధుల మంజూరు హర్షణీయం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయింపు హర్షణీయమని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. నిధుల కేటాయింపును హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వెస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మండల మాజీ కో ఆప్షన్‌మెంబర్ ఇర్షాదొద్దీన్, నాయకులు రాజన్న, ఆశ రాజు, జగ్గ బాల్‌రాజు, సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటస్థలం లేక ఇబ్బందులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆటస్థలం లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏడాది జాతీయ పండుగలు ఇతరాత్ర వేడుకల సమయంలో వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించడానికి ఆట మైదానం లేక సరిగా ఆడలేకపోతున్నారు. విద్యార్థులకు క్రీడలపై మక్కువ ఉన్నా మైదానం లేకపోవడంతో వారి ఉత్సాహం నీరుగారుతున్నది. గత్యంతరం లేక పాఠశాల ముందు ఉన్న కొద్దిపాటి స్థలంలో ఆడుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో పాఠశాల అవతల ఉన్న ప్రైవేట్ స్థలంలో ఆడిస్తున్నారు. కస్తూర్బా పాఠశాలలో 6 నుంచి 10 తరగతి వరకు 190మంది విద్యార్థులు చదువుతున్నారు. వివిధ క్రీడల్లో విద్యార్థులకు నైపుణ్యం ఉన్నా వారి ప్రతిభను కబర్చే అవకాశం లేకుండాపోతున్నది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పాఠశాల పక్కన ఆటస్థలం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, టీచర్లు కోరుతున్నారు.

సీఐకి సన్మానం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణానికి నూతనంగా వచ్చిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డిని ఏబీవీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నగరకార్యదర్శి చరణ్, నాయకులు సంజయ్, నవీన్, శివ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అయోధ్య అక్షింతల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లిలో అయోధ్య పూజిత అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో భక్తుల సందడి



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న హనుమాన్ ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో, ప్రాంగణం కిటకిటలాడింది.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



నిజాంసాగర్(జుక్కల్): నలభై ఒక్క రోజులపాటు భక్తిశ్రద్ధలతో కఠినదీక్షను ఆచరించిన అయ్యప్ప మాలధారులు శనివారం శబరిమలకు బయల్దేరి వెళ్లారు. నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల నుంచి చంద్రం గురుస్వామి, సంగమేశ్వర్‌గౌడ్ గురు స్వాములు ఇరుముడి కట్టి పూజించారు. కార్యక్రమంలో అయా గ్రామల సర్పంచులు కమ్మరికత్త అంజయ్య, దఫేదార్ బాలమణి, సొసైటీల చైర్మన్లు నరసింహారెడ్డి, వాజిద్‌అలీ నాయకులు తదితరులున్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రియాంక

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని అంకోల్‌లో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కెనరా బ్యాంక్ మేనేజర్ సందీప్, ఆత్మ సంస్థ మేనేజర్ ప్రియాంక, ఏఎస్ఎం పల్లవి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పతంగుల దుకాణాల తనిఖీ



పిట్లంలో మాంజాలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పంతగులు దుకాణాలను ఫారెస్ట్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ప్రమాదకర మాంజాలను విక్రయించొద్దని దుకాణదారులకు సూచించారు. ప్లాస్టిక్, చైనా, వైర్ మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ భూములను సర్వే చేయించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతీరాంనాయక్, సురేశ్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



భిక్కనూరు శ్రీ చైతన్య విద్యానికేతన్‌లో..



కామారెడ్డిలోని విద్యానగర్‌లో బహుమతుల ప్రదానం

కామారెడ్డి అర్బన్/భిక్కనూరు: సంక్రాంతిని పురస్కరించుకొని ముగ్గురుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. కామారెడ్డి విద్యానగర్‌కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కానీకి చెందిన 82 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ధ్రువీ పటేల్, తనూజ, సౌజన్య అందుకున్నారు. విద్యానగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షు డు ఎం.రాజన్న, కార్యదర్శి విశ్వనాథం, కోశాధికారి వెంకటేశం, కాలనీ గణేశ్ మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి కరస్పాండెంట్ బూర్ల రేణుకుమార్, ప్రిన్సిపల్ అశోక్‌యాదవ్ బహుమతులను అందజేశారు.

ప్రారంభమైన వాలీబాల్ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్‌లో మండలస్థాయి వాలీబాల్ క్రీడలను విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రతి ఏడాది సంక్రాంతిని పురస్కరించుకొని విశ్రాంత ఉపాధ్యాయుడు, గ్రామపెద్దలు మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆయా గ్రామాల నుంచి 22 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, స్నేహభావం పెంపొందడానికి, క్రమశిక్షణ అలవర్చుకోవడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, కాంతం, నరేశ్, సిద్ధు, సైదులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గర్గుల్‌లో ఉచిత దంత వైద్యశిబిరం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్‌లో నిమ్మాస్ డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ హాజరుకాగా, వైద్యులు 300 మంది గ్రామస్తులు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుడు అభిషేక్‌రెడ్డి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. వైద్యుడు క్రాంతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గరిగె శంకర్‌గౌడ్, యేసు స్వామి, ప్రవీణ్, స్వామి, సత్యనారాయణ, సాయిలు, రాజాగౌడ్, రమేశ్‌గౌడ్, నర్సింలు, నారాయణ, ఆర్ ప్రసాద్, రవీందర్ రెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాథుల కల్యాణోత్సవం



లింగాపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



కామారెడ్డిలోని రంగనాథస్వామి ఆలయంలో..

కామారెడ్డి రూరల్/ కామారెడ్డి అర్బన్/తాడ్వాయి: గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో, రంగనాథస్వామి ఆలయంలో, తాడ్వాయిలోని వేంకటేశ్వరాలయంలో కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగాపూర్‌లో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమిరెడ్డి పెద్ద నారాయణ, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, బండారి రాంరెడ్డి, నరహరి దంపతులు కూర్చున్నారు. రంగనాథస్వామి ఆలయంలో శ్రీరామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి ధనుర్మాస విశిష్టతను వివరించారు.



తాడ్వాయిలోని వేంకటేశ్వరాలయంలో..



పూజలు చేస్తున్న కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దంపతులు

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



సదాశివనగర్ శివారులో నీట మునిగిన వరి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పంట చేనులో నుంచి వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ రైతుల పాలిటశాపంగా మారింది. భూమిలో పంటలు సాగు చేసినప్పుడల్లా పైప్‌లైన్ లికేజీ కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మండల కేంద్రానికి చెందిన నాయిని గంగరాజు వ్యవసాయ పొలంలో నుంచి ఉన్న భగీరథ పైప్‌లైన్ గత రెండు రోజులుగా లీకేజీ కావడంతో శనివారం పంట పూర్తిగా నీటము నిగింది. ఈ విషయమై గతంలో కూడా జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని గంగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. తరచూ లీకేజీల కారణంగా పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి పైప్‌లైన్ లీకేజీని వెంటనే అరికట్టి పంట భూమిని కాపాడాలని కోరుతున్నారు.

సంక్రాంతి సందడి



మద్నూర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



ఎల్లారెడ్డిలో గాలిపటాల విక్రయాలు

పల్లెలు, పట్టణాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. మహిళలు పిండి వంటకాల తయారీలో, పిల్లలు పతంగుల ఎగురవేతలో బిజీగా మారారు. వాకిల్లు రంగురంగుల ముగ్గులతో ఆకట్టుకుంటున్నాయి. మార్కెట్‌లో పతంగుల, రంగుల విక్రయ దుకాణాలు వెలిశాయి. చిన్నారులను ఆకట్టుకునేందుకు రకరకాల పతంగులను విక్రయిస్తున్నారు. పలువురు చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో వెలసిన రంగుల దుకాణం



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో పతంగులు పంపిణీ చేస్తున్న గ్లోబల్ యూత్ సభ్యులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899